# దృక్పథం

సరిగ్గా రెండేళ్ళయింది మళ్ళా చదువులో చేరి. కాలం ఎంత త్వరగా గడచిపోతుంది! ఆ గాయం మొన్న మొన్ననే తగిలినట్లుంది. ఆ గాథ మనస్సును ఇంకా బలంగా హత్తుకుని ఉంది. అయితే, ఇప్పుడిప్పుడనిపిస్తోంది, బహుశా నేనే తొందర పడ్డానేమోననీ, నా దృక్పథం సరికాదేమోనని !

ఆయనెంత ధైర్యమూ, పట్టుదలా కల మనిషి ! రెండు సంవత్సరాలైనా ఒక్కసారైనా నాకు ఒక్క వాక్యమైనా వ్రాయలేదు. మాట తప్పకుండా, నెలతప్పకుండా డబ్బుమాత్రం పంపుతున్నారు. అది చూచినప్పుడల్లా నాకు గుండెల్లో మంట మళ్ళా రేగుతుంది. రోషం వస్తుంది. కులాసాగా ఉన్నావా? డబ్బు సరిపోతోందా?

ఇల్లాగ ఒక్క వాక్యమైనా, ఆ మనిఆర్డరు ఫారమ్‌లో నైనా ఎందుకు వ్రాయకూడదూ? అంత తప్పు ఏం జేశానూ? రోషం యెక్కువై దుఃఖం పొర్లివస్తుంది. ఈ మొండితనం ఏమిటి? నిజానికి ఈయనకు హృదయం లేదుకాబోలు అనిపిస్తుంది. ఈ డబ్బు నిజంగా నేను తీసుకోకూడదు. అయినా యిప్పుడు తప్పదు. ఈ చదువు పూర్తయి ఉద్యోగంలో చేరగానే ఆయన డబ్బు లెక్కప్రకారం మళ్ళా పంపించెయ్యాలి. అమ్మకు అక్కయ్యకు మళ్ళా నేను యిప్పుడు భారం కాలేను. ఈ ఊహతో ఊరటపొంది కన్నీళ్ళు తుడుచుకుంటాను.

ఈ భావం మళ్ళా యెంతోసేపు నిలవదు. ఏరాత్రివేళో చదివి చదివి అలసిపోయి కన్నులు వాటంతటనే మూతలుపడే సమయంలో, ఏదో ఉలిక్కిపడ్డట్లు స్ఫురణకు వస్తుంది. రాత్రి పూట పడుకోబోయేముందు వేడిపాలు త్రాగితేగాని ఆయనకు నిద్రపట్టదు. ఎవరు కాచి యిస్తున్నారో! భోజనం ఎవరు వండిపెడుతున్నారో! ఏదో మొరటుఊరికి బదిలీ అయిందన్నారు. అక్కడ పనివాళ్ళుమాత్రం నాజూకుగాచేసే వాళ్ళెవరు దొరుకుతారు! రాత్రిం పవళ్ళు ఆసుపత్రి గొడవతప్ప ఆయనకు ఇంకే గొడవా పట్టదు. భోజనం చేయమని కూడా యెవరైనా జ్ఞాపకం చెయ్యాలి! నేను ఉన్నప్పుడే అంతా గంటలు గంటలు యెదురుచూస్తూ, ఊరికే విరామం లేకుండా ఫోనుచేస్తూ వుంటే యెప్పటికో ఇల్లు గుర్తుకు వస్తుంది. ఆఖరక్షణంవరకు, బట్టలు ఉన్నాయో లేవో కూడా చూసుకోరు. చాకలి యెన్నాళ్ళు రాకపోతే అన్నాళ్ళు అల్లాగే వూరుకుంటారు. నేనువుంటే అన్నీ చూసుకునేదాన్ని. ఈ ఆలోచనలతో మనస్సు చెదరిపోతుంది. ఏదో శూన్యంగా బెంగగా వుంటుంది. ఇంక యెంతకూ నిద్రరాదు.

ఆవేళ ఆయన ఇంటికి భోజనానికి వచ్చేటప్పటికి మూడు గంటలయింది. మామూలుగా పన్నెండుకు వచ్చేస్తారు. నేను వంట అంతా పూర్తిచేసుకుని, ఇంక వచ్చేస్తారుగదా అని వరండాలో బల్లమీద కూర్చున్నాను. మా ఇంటిచుట్టూ మంచి రకరకాల పువ్వులతోట ఉన్నది. మాలతితీగ దట్టంగా అల్లుకుని సువాసనలు వెదజల్లుతూ ఉంటుంది. మేము యెక్కువ వరండా

లోనే కాలక్షేపం చేస్తాము. అక్కడ యెంతో చల్లగా ఉంటుంది.

ఏదో ఆలోచిస్తూ అల్లాగే చాలాసేపు కూర్చున్నాను. ఎంతసేపటికీ ఆయన రాలేదు. నాకు ఆకలి, నిద్ర, నీరసం అన్నీ కలిసి ఏదో మంపుగా వున్నది. ఆ బల్లమీద ఓమూల ఆవేళ వచ్చిన ఉత్తరాలన్నీ కట్టగాపడి ఉన్నాయి. ఆయనదగ్గర మందులు పుచ్చుకు వెళ్ళిన వారందరూ యేదో సలహాలు అడుగుతూ, కృతజ్ఞత తెలుపుతూ ఉత్తరాలు రాస్తుంటారు. ఏదో ఒకరోజు తీరిక చూసుకుని ఆయన అందరికి శ్రద్ధగా జవాబులు రాస్తారు. అందుకే రోజురోజుకి ఆయనకు ఉత్తరాల కట్టలు పెరిగిపోతుంటాయి. ఇవికాక యింకా యేవో వైద్య పత్రికలూ, మందుల జాబితాలు, ప్రకటనలు వస్తూనేవుంటాయి. నాకు యివన్నీ చూచే ఓపిక లేదు. నా కెవరూ వ్రాయరు. అమ్మా, అక్కయ్యా ఉత్తరాలు రాయడం మానేసి చాలా రోజులైంది. నా పెళ్ళయ్యాక రాయలేదు. ఇక స్నేహితులెవ రైనా వ్రాస్తే బద్ధకించి నేను జవాబురాయను. వాళ్ళూ రాయరు.

ఒంటిగంటయింది. ఆయన యింకా రాలేదు. ఏమీ తోచక ఉత్తరాలకట్ట తీసుకున్నాను. అన్నీ ఊరికే పరధ్యాన్నంగా పైన చూసి పక్కన పెడుతున్నాను. మధ్యలో ఓ కవరు చాలా బరువుగావుంది. ఆ ఉత్తరం బరువుకు పలచని కవరంతా పూర్తిగా చినిగిపోయింది. అది చాలా పెద్దఉత్తరం. కవరు చినిగిపోవడం మూలాన మడిచిన కాగితాలకట్ట బయటికి వచ్చింది. దస్తూరి యెక్కువ చదువుకోని అమ్మాయిలదిలా

ఉంది. ఇంత పెద్ద ఉత్తర మేమిటని ఆశ్చర్యపోతూ విప్పి చూశాను.

అది రాజ్యలక్ష్మి అని ఒక అమ్మాయి వ్రాసింది. ఆ అమ్మాయి అదివరకు కొన్నాళ్ళు ఆసుపత్రిలో ఉందిట ప్రత్యేకంగా ఆయన ఆదరణా, అభిమానంవల్ల కోలుకుందిట! ఆసుపత్రిలో ఆయనచూపిన వాత్సల్యాన్ని ఆయనతో గడిపిన మధురక్షణాలనూ యెన్నటికీ మరువలేదట! ఆయన ఆదరంగా తన తల నిమరడమూ, ప్రేమతో తన కన్నీరు తుడవడమూ, ధైర్యం చెప్పడమూ, ఒక్కొక్కరోజు తను నిద్రరాక బాధ పడుతూ ఉంటే, ఆయన తనచేయి పట్టుకుని యేదో కబుర్లు చెబుతూ, తను నిద్రపోగానే మెల్లగా ఆచేయి వదలించుకుని వెళ్ళిపోవడమూ, యిల్లాంటి మధురానుభూతులెన్నో వివరంగా వర్ణించింది. ఆ అభిమానమే తనకు యిప్పుడు ఆధారమనీ, అది తలచుకుంటూ సుఖంగా జీవితం గడపగలననీ యింకా ఏవేవో వ్రాసింది.

నాకేదో తల తిరిగినట్లయింది. కొంచెం చదివాక యింక నేను చదవలేదు. ఆ ఉత్తరమంతా యేదో చెప్పలేని ఉద్రేకమూ, కృతజ్ఞతా నిండి వున్నాయి. ఉత్తరాలు అవతల పారేసి టైము చూసుకుంటే రెండవుతోంది. విసుగూ నీరసానికి తోడు యీ ఉత్తరం మనస్సుచు కలిచివేసింది. ఆయన నన్నేదో అవమాన పరచినట్లు బాధ కలిగింది.

ఆసుపత్రికి ఫోను చేశాను. ఆడవాళ్ళ మాటలు నవ్వులు ఫోనులోకి సన్నగా వినబడుతున్నాయి. వీళ్ళతో కబుర్లు

చెబుతూ ఈయనకు ఇంటిగొడవ పట్టడంలేదు అని కోపం వచ్చింది. ఎవరో సమాధానం చెప్పారు. "ఆయన యిక్కడ లేరు. ఆపరేషన్ థియేటర్‌లో వున్నారు" అని. ఫోను పెట్టే శాను. ఆయన లేకపోతే వీళ్ళంతా ఆయన గదిలో ఏంచేస్తు న్నట్లు ! నా కేదో అనుమానం వేసింది. నామీద నాకే జాలి వేసింది. నే నేమో ఈయనకోసం అన్నీ వదలుకుని దాసీ దానిలా ఇంటిపనులన్నీ చేస్తూ, వచ్చిన చదువు మరచిపోయి, బాహ్య ప్రపంచంతో సంబంధం లేకుండా ఆయనే సర్వస్వం అనుకుని, వేళకు తిండీ తిప్పలూ కూడా లేక ఆయనకోసం యెదురు తెన్నులు చూస్తూ కాలక్షేపం చేస్తున్నాను. ఆయ నేమో అందరితో సరసాలు, ప్రేమకలాపాలు, ప్రణయ లేఖలు. నాకు దుఃఖం ముంచుకు వచ్చింది. నేనేదో జీవితంలో దగా పడి మోసపోయి నట్లని పించింది.

గడచిన జీవితం గుర్తుకు వచ్చింది. నే నెటువంటి పరి స్థితులలో అన్నీ త్యాగంచేసి ఆయనను వివాహం చేసుకోగలి గినదీ గుర్తుకు వచ్చింది.

ఆయన ఆఖరి సంవత్సరం డాక్టరు చదువుతూ ఉండగా నేను మూడో సంవత్సరం చదువుతున్నాను. ఆ సంవత్సరం వార్షికోత్సవంలో మేమిద్దరమూ ఒకే నాటికలో పాల్గొన్నాము. అందులో ఆయన భర్త వేషమూ, నేను భార్య వేషమూ వేయవలసి వచ్చింది. ఒక నెల రోజులు రిహార్సల్సు కోసం కలుసుకుంటూ ఉంటే మా కిద్దరికీ పరిచయం బాగా వృద్ధి అయింది. ఒక నెలరోజులు భార్యా భర్తలుగా నటించటంతో

ఒకరి నొకరు ఆ దృష్టితో చూచుకోవడం అలవాటై ఈ సం బంధము నటనమాత్రమే కాక శాశ్వత బంధమే అయితే ఎంత బాగుండుననను ఊహ అస్పష్టంగా అంకురించింది. ఆ నాటిక అందరూ ఎంతో మెచ్చుకున్నారు. ఉత్తమ నటనకు మా ఇద్దరికి మంచి బహుమతులు లభించాయి.

ఆ తరువాత ఆయన మాయింటికి రోజూ వచ్చేవారు. త్వరలోనే మేము వివాహం చేసుకోవాలని నిశ్చయించు కున్నాము. ఆయనకు ఆడవాళ్ళు ఉద్యోగం చేయడం అంతగా ఇష్టం లేదు. ఇద్దరూ ఉద్యోగం కోసం వెళ్ళిపోతే ఇంక ఇల్లు చూచుకునే వాళ్ళెవరుంటారు. ఆయన అభిప్రాయాల కను గుణంగా నేను పెళ్ళికాగానే చదువు మానేయాలనుకున్నాను. అంచేత నేను డిగ్రీపొంది డాక్టర్ అనిపించుకో లేకపోయాను,

ఈ పెళ్ళి అమ్మకు, అక్కయ్యకు ఇష్టం లేకపోయింది. ఒకటి ఆయనది మాకులం కాదు. రెండవది అమ్మకూ, అక్క య్యకూ అసలు నేను వివాహం చేసుకోవటమే ఇష్టం లేదు. డాక్టరు పూర్తి చేసుకుని ఉద్యోగం చేస్తూ స్వతంత్రంగా ఉండా లని, ఆ తరువాత ఎప్పుడో పెళ్ళి సంగతి ఆలోచించ వచ్చనీ, వాళ్ళ ఉద్దేశం.

అక్కయ్యకు చిన్నప్పుడే పెళ్ళిచేశారు. అది అత్తవా రింట్లో ఉన్న కొద్దిరోజులూ నరకం చవిచూచింది. అత్తగారి బాధ, భర్తనిర్లక్ష్యమూ రెండూ భరించలేక అది త్వరగానే మాయింటికి వచ్చేసింది. ఆ తరువాత అమ్మ యెంత చెప్పినా తిరిగి వెళ్ళడానికి యిష్టపడలేదు. మళ్లా చదువులో చేరి యిప్పుడు

ఉద్యోగంలో ఉంది. నాకు తొందరపడి పెళ్ళి చేయకుండా స్వతంత్ర జీవనం కల్పించాలని దాని ఉద్దేశం. దానిపట్టుదలతోనే నన్ను డాక్టరు కోర్సులో చేర్పించారు. ఒకసారి దెబ్బ తిన్న అమ్మకూడా ఇదే మంచిదనుకుంది.

ఇప్పుడు హఠాత్తుగా మధ్యలో నేను చదువు మానేసి పెళ్ళి చేసుకుంటా ననడం వాళ్ళిద్దరికీ నచ్చలేదు. కనీసంచదువు పూర్తి అయ్యేవరకైనా ఆగమన్నారు! నేను వినలేదు. వాళ్ళకు కోపం వచ్చింది. ఈ పెళ్ళయ్యాక నాతో సంబంధం తెంపుకున్నారు.

ఇవన్నీ జ్ఞాపకంవచ్చి చాలాబాధ కలిగింది. అయిన వాళ్ళను కూడా కాదనుకుని నేను సాధించిన దేమిటి? ఇప్పుడు ఈ విధంగా ఈయన నన్ను నిర్లక్ష్యం చేస్తున్నారు అని క్షోభ పడింది హృదయం.

మూడు గంటలకు ఆయనవచ్చారు. చాలా అలసిపోయి నట్లున్నారు. మామూలుగా మాట్లాడడానికి కూడా ఆయనకు ఓపిక లేదు. కోపంలోఉన్న నాకాక్షణంలో అవేవీ మనసుకు పట్ట లేదు. ఆయన బట్టలు మార్చుకుని ముఖం కడుక్కొని వచ్చే లోగా నేను భోజనం వడ్డించాను. నా ముభావానికి ఆలస్యంగా రావడమే కారణమని ఆయన అనుకుని ఉంటారు. అందుకనే నేను అడక్కుండానే, "సరిగ్గా పన్నెండుకు బయలు దేరబో తూంటే యెక్కడో లారీ జట్కాకు కొట్టుకుందట. అక్కడ గాయాలు తగిలిన వాళ్ళందరినీ తీసుకువచ్చారు. పాపం ఓచిన్న

పిల్లకు చేయివిరిగింది" అంటూ ఆలస్యానికి సంజాయిషీ చెప్పు కున్నారు.

నేనేమీ చలించలేదు. మామూలుగా అయితే కంగారు పడి ఎన్నో వివరాలు అడిగి ఉందును, అయన చెప్పిఉందురు. కాని అవ్వాళ మాట్లాడలేదు. కాస్సేపటికి "ఉత్తరాలు చూసు కున్నారా?" అన్నాను. ఆయన లేదన్నారు. నేను కొంచెం అసూయతో "ఎవరో రాజ్యలక్ష్మిట! చాలా పెద్ద ఉత్తరం రాసింది" అన్నాను. ఆయన ముఖంలో ఏమువంటి చలనమూ కనిపించలేదు. భోజనం ముగించి వెళ్ళిపోయారు.

నేను పని ముగించుకుని ముందరగదిలోకి వచ్చేసరికి హాయిగా మంచంమీద పడుకుని ఆఉత్తరమే చదువుతున్నారు. నేను వచ్చిందే ఆయన గమనించలేదు. ఆ నిమిషంలో అనుకు న్నాను, "ఇంతటితో ఈ అమ్మాయితో సంబంధము వదలి పోవాలి. లేదా నేనైనా ఈ ఇల్లు వదలిపోవాలి" అని.

ఆ రాత్రి ఆయనతో ఈ విషయం చెప్పాను. ఆయన నెమ్మదిగా అన్నారు: "ఆ అమ్మాయి క్షయవ్యాధితో బాధ పడుతోంది. ఎవరూ దిక్కులేరు. ఇప్పుడు కాస్త నయమై మళ్ళా ఉద్యోగం చేస్తోంది. ఊరికే ఉత్తరాలు రాసినందువల్ల నష్టమేమీ లేదు. జీవితంలో ఏదో కొంత సంతృప్తి ఉంటే వ్యాధి తిరగబెట్టకుండా ఉంటుంది. అంతకన్నా ఆ అమ్మాయితో నాకు సంబంధం లేదు" అని.

ఈ మాటలు నాచెవి కెక్కలేదు. నేనా రాజ్యలక్ష్మిని ఎప్పుడూ చూడలేదు. వారంరోజు లయ్యాక ఆ అమ్మాయి

మళ్ళా ఉత్తరం రాసింది. అది నాకు నిప్పులో నెయ్యిపోసిన ట్లయింది.

ఆ వేళ ఆయన ఇంటికి రాకముందే, నేను ప్రయాణానికి అన్నీ సిద్ధంచేసుకున్నాను. ఎక్కడికి వెళ్ళాలో ఏం చెయ్యాలో కూడా నిశ్చయించుకున్నాను. అమ్మా వాళ్ళదగ్గరకు మళ్ళా పోద లచుకోలేదు. నా స్నేహితురాలు రేవతి దగ్గరకువెళ్ళి తరువాత మళ్ళా చదువు పూర్తిచేసుకోవా లనుకున్నాను.

ఆయన ఇంట్లో అడుగుపెడుతూనే అన్నాను. "నామాట మీకు లక్ష్యం లేనప్పుడు ఇక్కడ ఉండాల్సిన బాధ్యత నాకు లేదు. నేను ఇవ్వాళ వెళ్ళిపోతాను" అన్నాను. అంటూ ఆ వేళ వచ్చిన ఉత్తరం తీసి ఆయనవేపు విసిరాను. అది మా ఇద్దరికీ మధ్యగా పడింది. ఆయన దానివంక చూడనేలేదు. ముఖం కోపంతో యెర్రబడిఉంది. మళ్ళా నేనే అన్నాను. "మీకోసం నేను అన్నీ వదలుకున్నాను. అంచేత నన్ను ఆదుకోవలసిన బాధ్యత మీకున్నది. నేను మళ్ళా చదువుకుంటాను. ఆ భారం మీరు వహించక తప్పదు" అన్నాను. ఆయన అపరిమితమైన విరక్తితో అక్కడే డ్రాయరులో ఉన్న కవరుతీసి నా కిచ్చి వెళ్ళిపోయారు. అది ఆయన అన్నగారు పంపిన పంటతాలూకు డబ్బు రెండువేలు ఎవరో మనిషి తెచ్చియిస్తే కవరులోపెట్టి అందులో ఉంచారు. ఆయన నాదే తప్పయినట్లు కోపంగా ఉండడం నాకు చాలా బాధకలిగింది.

నేను ఆయనదగ్గరకు వెళ్ళి "ఈ డబ్బు చాలదు. మీరు మళ్లా పంపాలిసి ఉంటుంది" అన్నాను. ఆయన యేమీ మాట్లాడలేదు.

నేను సాయంత్రం వెళ్ళిపోతాను" అన్నాను. అప్పుడు సమాధానం చెప్పారు:

"నువ్వు మనస్సు మార్చుకుంటే మంచిది. లేదా నీ ఇష్టం" అంటూ వెళ్ళిపోయారు. నేను ఒక్కదాన్ని ఇంట్లో బాధపడుతూ కూర్చున్నాను. నాలుగుగంటలకు ఫోనువచ్చింది. ఒక్కటే మాట. "ఏం నిశ్చయించావు?" అన్నారు. "వెడుతున్నాను" అన్నాను. మళ్ళా మాటలేదు.

తరువాత టాక్సీలో శంకరంగారు వచ్చారు. "అయ్యగారు మిమ్మల్ని రైలెక్కించి రమ్మన్నారు" అన్నాడు. నేను ముఖం మాడ్చుకుని ఇంటికి తాళంవేసి, తాళంచెవి శంకరానికిచ్చి టాక్సీ ఎక్కాను. రైలెక్కగానే శంకరాన్ని పంపించి వేశాను. రైల్లో కూర్చోగానే దుఃఖం ముంచుకు వచ్చింది. నేను పదేపదే కళ్ళు తుడుచుకుంటూ ఉంటే, పక్కన ఉన్నావిడ "మీవాళ్ళ కెవరికైనా సుస్తీగా ఉండి వెళుతున్నారా?" అన్నది. నేను జవాబు చెప్పలేదు. దూరాన గేటుదగ్గరగా ఆయన నిలబడి ఉన్నట్లు లీలగా తోచింది. ఏదో ఆశతో ముందుకువంగి చూశాను. గుండెల్లో ఏదో గుబగుబలాడింది. ముందుకువస్తే బాగుండును, దగ్గరకువస్తే బాగుండును, ఏదో విధంగా ఈ ప్రయాణం ఆగిపోతే బాగుండును అనిపించింది. కూత వేసి రైలు కదలిపోయింది.

◆ ◆ ◆

సరిగ్గా రెండేళ్ళయింది, సావిత్రి వెళ్ళిపోయి.

ఈ సంవత్సరంతో చదువు పూర్తయిపోతుంది. ఆమె మళ్ళా నా దగ్గరకు వస్తుందన్న ఆశ నాకుపోదు. నన్ను విడిచి ఆమె ఉండలేదు. ఆమెను విడిచి నేనూ ఉండలేను. పెడదారి పట్టిన ఈ ప్రవాహం ఎప్పుడో మళ్ళా మలుపు తిరగక తప్పదు. అప్పుడు చీలిపోయిన ఈ సెలయేరు మళ్ళా ఒక్కటే అవుతుంది. ఒకే గమ్యం చేరుకుంటుంది.

సావిత్రి అమాయకురాలు. ప్రేమమూర్తి. అంత అనురాగానికి నేను అర్హుణ్ణి కావడం అదృష్టం! ఏదైనా ఒకవిషయం మనస్సుకు తోస్తే దాంట్లో లీనమైపోవడం ఆమె స్వభావం! ఆ నిమిషంలో ఇతరవిషయాలేవీ ఆమెకు పట్టవు. మా పెళ్ళి విషయంలోనూ అంతే అయింది. చిన్నప్పటినుంచీ ఆదుకున్న బంధువులను ఒక్క నిమిషంలో కాదనుకున్నది. అక్కడికే నేనన్నాను, పోనీ మీవాళ్ళ ఇష్టప్రకారం నీ చదువన్నా పూర్తి అయ్యేవరకు ఆగుదామని. ఆవిడ ఒప్పుకోలేదు. "నే నెల్లాగు ఉద్యోగం చేయడం మీకిష్టంలేదుకదా! ఇంకెందుకు చదవడం" అన్నది. నాకూ అది సబబుగానే తోచింది.

అయితే ఇప్పుడనిపిస్తోంది. నేనామెను చదువు మాన్పించడం మంచిదికాదేమోనని. ఆమెకూడా నాతోపాటు ఈ వైద్యవృత్తిలో సహకరిస్తూ ఉంటే, ఇల్లాంటి కలతలకు అసలు అవకాశమే లేకపొయ్యేదేమో! నాకోసం ఎదురు చూడడం తప్ప వేరే వ్యాపకం, లేకపోవడమూ, నేను తప్ప ఇంకెవరూ

స్నేహితులు లేకపోవడమూ, అసంతృప్తికీ అసహనానికీ దారి తీసి ఉంటాయి. దృక్పథం సంకుచితమై ఉంటుంది.

రాజ్యలక్ష్మి కొన్నాళ్ళు ఆసుపత్రిలో ఉంది. క్షయ వ్యాధి. చాలా రోజులు అశ్రద్ధ చేయటం మూలాన వేళ్ళు పాదుకొని మొండికిబారింది. ఆమెకు బంధువులు ఎవరూ లేరట. వేలువిడిచిన మేనత్త ఎవరో కొద్దిగా చదువు చెప్పించింది. తరువాత ఎక్కడో చిన్న ఉద్యోగంలో చేరింది. జీవితంలో ఎటువంటి ఉత్సాహమూ, ఆసక్తి లేక వ్యాధిని నిర్లక్ష్యం చేసింది. ప్రేమ, ఆదరణ చూపేవ్యక్తులు ఎవరూ లేనప్పుడూ జీవితం మోడుబారిపోతుంది. బ్రతకాలన్న కోరిక కూడా నశిస్తుంది. "నాకీవ్యాధి నయంకాకపోతే ఏం, నేను జీవించి యెవరిని ఉద్ధరించాలి" అన్నదే రాజ్యలక్ష్మి తత్వం. ఈ భావం మారి జీవించాలన్న ఆశ మళ్లా రేకెత్తితేనేగాని ఆమె వ్యాధి కుదిరేటట్లుగా నాకు తోచలేదు. వైద్యుడు మందు ఇవ్వగలడు కాని, రోగి సహకారం లేనిదే మందులు పనిచెయ్యవు. వ్యాధి నెట్లాగైనా జయించాలి ఎట్లాగైనా జీవించాలి అన్న బలమైన కోరిక రోగికి లేకపోతే, వైద్యుని ప్రయాస ఒక్కొక్కసారి నిష్ప్రయోజనమే అవుతుంది.

ప్రతి జీవితానికి ప్రయోజనం ఏమిటి అని ప్రశ్నించడం నాధర్మంకాదు. ప్రతిప్రాణిని రక్షించడంమాత్రం నాధర్మం. ప్రతిజీవికీ వీలైనంతవరకు బాధ ఉపశమింప చేయడం, జీవిత కాలాన్ని పెంపొందించడం నా విధ్యుక్తధర్మం.

వైద్యుని మనస్సులో స్త్రీ, పురుష భేదం ఏనాడో నశిస్తుంది. యోగుల మనస్సులో ఏమోకాని, వైద్యుని మనస్సులో ఈ శరీరం కేవలం రక్త మాంసముల గూడు, రామయ్యా, రామమ్మ ఈపేర్లతో నాకు సంబంధం లేదు. మూడో నంబరు రోగి, నాలుగో నంబరు రోగి అంతే! నాకంటికి కనిపించేది ఒక వ్యాధిగ్రస్తమైన శరీరం! వారి కన్నులలో నేను చూచేది ఒక ఆరని వెలుగు, ఆత్మజ్యోతి !

రాజ్యలక్ష్మి శరీరంలో మిగిలినది ఎముకలగూడు. కన్నులలో నిండినది నీరసించిన ఆత్మ వేదన. ఆమెకు వైద్యం చేయడం ప్రారంభించిన రెండు మూడు వారాలలోనే నాకు తెలిసిపోయింది. మందులు ఇంజక్షన్లతో పాటు ఆమెకు జీవితంలో ఉత్సాహం కలిగిస్తే తప్ప లాభం లేదని. అంచేతనే అవసరం లేకపోయినా నేనామెతో కొంచెం ఎక్కువ కాలం గడిపి, ప్రత్యేక శ్రద్ధచూపి ఆమెమనస్సు మార్చడానికి ప్రయత్నం చేయవలసి వచ్చింది.

"ఈ జీవితం నిరర్థకం అనుకోనడం కన్న మహా పాపం మరొకటి లేదు. ఈజీవితానికి సార్థకత యేమిటి, ఫలమేమిటి అని ప్రశ్నించుకుంటూ కూర్చునే అర్హత నీకు లేదు. ఆబాధ్యత నిన్ను సృష్టించిన భగవంతునికే వదిలెయ్యి. ఏదో కారణమూ, ప్రయోజనమూ లేకుండా సృష్టి జరుగనే జరుగదు. నీజీవితానికి ఏదో ఫలం ఉండనే ఉంటుంది. కనీసం, సంకుచితంగా ఆలోచిస్తే, మీ మేనత్తను పెద్దతనంలో ఆదుకునే బాధ్యత నీదేకదా ! నీవు ఉద్యోగం చేస్తే ఆమెను పోషించవచ్చును. నీవు లేకపోతే ఆమెకు

నిరాధారమవుతుంది. నీ జీవితానికి ఇంతమాత్రం ప్రయోజనం ఉండనే ఉన్నది. జన్మ ఎత్తేటప్పుడు మనప్రమేయం ఏమీ లేదు. జన్మ అంతం చేసుకోటానికి మనకు అధికారం అసలే లేదు."

ఈ విధంగా ఆవిడతో ఎన్నోసార్లు మాట్లాడుతూఉండే వాణ్ణి. క్రమంగా ఆవిడ మనస్సు మారింది. నిరుత్సాహం తగ్గి పోయింది. "తల్లిలా చూసుకునే మేనత్త, ఎంతో ఆదరంతో అభిమానమూ, ప్రేమా చూపే మీవంటివారు లభించినప్పుడు నాకింకేమికొరవ ఉంటుంది; ఏమీ లేదు'' అనేది ఉత్సాహంతో.

ఆ తరువాత క్రమంగా కోలుకుంది. వెళ్ళిపోయింది. వెళ్లే రోజు సావిత్రిని చూస్తానన్నది. చూడందే వెళ్ళనన్నది. కాని నాకు ఆసుపత్రి వదలడానికి వీలుపడలేదు. ఆమెకు రైలు లై మయింది. వెళ్ళిపోయింది.

ఏవేవో ఉత్తరాలు రాస్తుంది. మళ్ళా ఉద్యోగంలో చేరింది. ఖులాసాగానే ఉన్నానంటుంది. ఆమెమళ్లా మామూలు మనిషిగా మారిందని నాకు చాలాసంతోషం. ఆమె ఉత్తరాలు పూర్తిగా చదవడానికికూడా నాకు తీరికవుండదు. ఎప్పుడో ఒకసారి రెండు పంక్తులు జవాబు వ్రాస్తాను. అదే ఆవిడకు సంతోషం. నేను వ్రాయకపోయినా ఆమె ఆత్మతృప్తికోసం ఏదో వ్రాసుకుంటూ ఉంటుంది. ఈమాత్రం ఆనందానికి నేను నిమిత్త మాత్రుణ్ణి అయినందువల్ల నష్టమేమిటి! ఈకాస్త సంతృప్తిఐనా ఆమెకు ఎందుకు లేకపోవాలి! పైగా మళ్ళా నిరాశలో చిక్కుకున్నదంటే వ్యాధి తిరగబెట్టవచ్చు. ఆ పరిస్థితి రాకుండా కాపాడవలసిన బాధ్యత వైద్యునిగా నాకున్నదిగదా!

సావిత్రికి చిన్నతనం ఇంకా వదలలేదు. దృక్పథం ఇంకా విశాలం కాలేదు. ఆమె తనచదువు పూర్తిచేయడమే మంచిది. కొన్నాళ్ళకి మనస్సు విస్తృత మవుతుంది. సంకుచిత భావాలు వాటంతటవే పోతాయి. అందుకే ఆమె వెళ్ళిపోయి చదువుకుంటానంటే, నాకు ఎంతో బాధగావున్నా అడ్డుచెప్పలేదు. పైగా ఆ స్థితిలో నేనేమి చెప్పినా ఆమె చెవి కెక్కదు. కొన్నాళ్ళకు ఆమెకే తెలుస్తుంది.

ఆమె వెళ్ళేముందు నేనేమీమాట్లాడలేదు. అసలల్లా వెళ్ళి పోతానంటుందని నాకు తోచనేలేదు. ఒక్కసారి అంతా శూన్యంగా తోచింది. ఆమె అపోహలకు, మూర్ఖత్వానికి కోపమూ, జాలి, ఇన్నాళ్ళయినా నా వ్యక్తిత్వాన్ని తెలుసుకోలేక పోయిందని విచారము కలిగింది. ఇంట్లోనించి వెళ్ళిపోయాను. ఆమె వెళ్ళిపోతూవుంటే చూసి భరించలేను. మళ్ళా శంకరాన్ని పంపికూడా ఉండలేక నేను స్టేషనుకు వెళ్ళాను. దూరాన్నుంచే ఆమెను చూస్తూ ఉండిపోయాను. దగ్గరకు వెళ్ళి ఆమెను బలవంతంగా ఆపాలని ఎంతో ఆరాటపడ్డాను. కాలు నిలువలేదు. ధైర్యం సడలిపోయి నేను తీరా అడుగుముందుకు వేసేటప్పటికి రైలు కదలిపోయింది.

ఈ రెండేళ్ళు ఎన్నోసార్లు వ్రాయాలనుకుని బలవంతంగా అణుచుకుంటున్నాను. ఒకసారి నామూలాన ఆమెచదువు పాడయింది. ఇప్పుడు మళ్ళామధ్యలో నేనే భంగం కలిగించకూడదు. మనస్సులో ఈ బాధను అణచుకుంటూ, ఈ శూన్యాన్ని భరిస్తు

న్నాను. ఆమె చిరునవ్వుతో నన్ను చూచినట్లే ఉంది. నేను నిద్రపోయేటప్పుడు ప్రేమతో నాతల నిమిరినట్లేఉంటుంది.

ఇక కొద్ది రోజులే! ఆమె తిరిగి రాకతప్పదు. అంత వరకు ఈ ఇల్లు ఆమెకోసం కనిపెట్టుకునే ఉంటుంది. ఈ కళ్ళు ఆమెకోసం ఎదురు చూస్తూనే ఉంటాయి.

◆ ◆ ◆

సరిగ్గా రెండు నెలలవుతుంది, ఆవేళ రైల్లో ఆమె కనిపించి. నేను మా ఊరు వెడుతున్నాను సెలవుపెట్టి. త్రోవలో ఆమె యెక్కింది. ఇద్దరమే ఉన్నాము పెట్టెలో. ఆమెపలకరించినా మాట్లాడే ధోరణిలో లేదు. తలవంచుకు ఏదో చదువుకుంటూ కూర్చుంది, మధ్యమధ్య కిటికీలో నుంచి శూన్యంలోకి చూస్తూ. పక్కబల్లమీదే నేను పడుకున్నాను ఊరికే ఆమెను చూస్తూ. యెంత అందంగా ఉన్నది! వంపులు తిరిగిన ముంగురులు. పెద్ద పెద్దకళ్లు. తెల్లగా దంతపు బొమ్మలా ఉన్నది. అంత అందంగా ఉన్నానన్న స్పృహ ఆమెకు లేదు ఏదో పరధ్యానంగా ఉన్నది.

ఆమె ప్రక్కన ఉండటానికి నాకు అవమానమనిపించింది.

భగవంతుడు నన్నూ సృష్టించాడు! ఎందుకూ ఇంత అందవికారంగా. యెప్పుడైనా పొరపాటున అద్దంకేసి చూస్తే నాకే బాధగా ఉంటుంది. కమిలి కృశించి బొమికలు మాత్రము మిగిలిన ఈ దేహమూ, కాంతివిహీనమైన ఈ నలుపువర్ణము. ఎందుకో ఈ సృష్టి! అబ్బా! నాకు అప్పుడప్పుడు ఈ భూమి చీలి నేను లోపలికి కృంగిపోతే బాగుండుననిపిస్తుంది. జన

ప్రవాహానికి అంచున నిలబడి, ఆ ధార నా ఉనికినే గమనించ కుండా ముందుకు సాగిపోతున్నప్పుడు, ఈ జీవితం నిరర్థకమనిపిస్తుంది. నేను ఎప్పుడూ ఎవరినీ ఏవిధంగానూ ఆకర్షించలేను. ఎవరి స్నేహాన్నీ సంపాదించుకోలేను. దురదృష్టవంతురాలిని. చిన్నప్పుడే తల్లినీ తండ్రినీ పోగొట్టుకున్నాను. అత్తయ్య చేర దీసి పెంచింది. ఎందుకో? ఆవిడకు అంతకన్న ఆధారం దొరికి ఉండదు ఆమెకు డబ్బూలేదు. ఎల్లాగో కష్టపడి కొన్నాళ్ళు చదివించింది. ఇప్పుడు నేను తెచ్చే జీతం మా ఇద్దరికీ చాలు. రోజంతా నెలంతా పనిచేస్తే వచ్చేది భోజనానికి సరిపోతుంది. కాని ఎందుకూ ఈ మనుగడ! ఈజీవితానికి ప్రయోజనమేమిటి? లోకాన్ని నేను ఉద్ధరించలేను. ఈ లోకానికి నా అవసరమూ లేదు. శూన్యమైన రాతిబండలమీద ఒక్కొక్కరోజు ఒక్కొక్క అడుగు వేస్తూ ఎందుకీ ప్రయాణం? ఈ ఆలోచనలతో మనస్సు వికలమై పోతుంది.

దరిద్రుని తలమీదనే వడగళ్ళవాన కురుస్తుందిట! నాకు ఏదో వ్యాధి కూడా పట్టుకుంది. ఆఫీసువాళ్లు ఆరునెలలు సెలవు ఆరునెలల జీతం అప్పు ఇచ్చారు నయంచేసుకోమని. అంత మాత్రం దయ ఉంటుందనుకోలేదు. అయినా నాకు మొదట్లో బ్రతకాలన్న కోరికేలేదు. మగతగా కళ్లుమూసుకుని శాశ్వతంగా నిద్ర ఎప్పుడు వస్తుందాని ఎదురు చూసేదాన్ని! నాకు మందిచ్చిన డాక్టరుగారు మాత్రం నా జబ్బుకే కాకుండా నాలో నిండుకున్న నిస్పృహకు కూడా ఏదోవిధంగా మందు ఇవ్వడానికి గట్టిగా పూనుకున్నట్లు తోచింది. ఆయనకు నా కన్న మొండి

తనం. నాకు లేని ఓపిక ఎంతో ఎక్కువ. నేను విన్నా వినక పోయినా ఆయన చెప్పేవి చెబుతూనే ఉన్నారు. ఇచ్చే మందులు ఇస్తూనే ఉన్నారు. క్రమంగా నా మనస్సు మారి పోయింది. నా ఆలోచనలు మారిపోయాయి. ఏదో విధంగా బ్రతకడం నేర్చుకోవాలిగాని, బ్రతికి ప్రయోజనమేమిటి అను కోడమేమిటి పిచ్చి! ఆ డాక్టరు చేసిన ఉపకారం ఈజన్మలో మరచి పోలేను. ఆయన ఎంత మంచివారు! ఇప్పుడు నాకు విచారం లేదు. ఆఫీసులో పని చేస్తున్నంతసేపు, అత్తయ్యతో మాట్లాడుతున్నంతసేపు సంతోషంగానే ఉంటుంది. తృప్తిగానే ఉంటుంది. ఈ అందవికారము, నిస్సహాయత్వము ఇప్పుడంతగా బాధగా లేవు.

♦ ♦ ♦

ఆమె పుస్తకం మూసి కిటికీలో తలవాల్చి శూన్యంగా చూస్తూ కూర్చుంది. సన్ననిరంగు పువ్వులు కుట్టిన పమిట కొంగు తలచుట్టూ కప్పుకుంది. ఇంత అందమైన ఈ ముఖము ఎందుకింత దీనంగా ఉన్నది. నాకు ఉండబట్టలేదు.

"ఏ ఊరు వెడుతున్నారు?" అని అడిగాను.

ఆమె చెప్పింది.

"అత్తవారింటికా?" అన్నాను.

ఆమె నవ్వింది.

"కాదు హాస్టలుకు, డాక్టరు చదువుతున్నాను" అన్నది.

నేను మా డాక్టరుగారిపేరు చెప్పాను "ఆయన్ను ఎరుగు దురా?" అన్నాను. ఆమెముఖం పాలిపోయింది. ముభావంగా

యెరుగుదునన్నది. నేను ఉత్సాహంగా చెప్పుకుపోయాను. "ఆయన నాకు దేవునితో సమానం. నా ప్రాణం కాపాడారు. నాకు మళ్ళా జీవంపోశారు. ఆయన ఆస్పత్రిలో కొన్నాళ్ళు ఉన్నాను" అంటూ ఏదో ఉద్రేకంతో చెప్పాను. ఆమె ఉదాసీనంగా విన్నది. ఏదో భయపడుతున్నట్లు మెల్లిగా అడిగింది. "మీ పేరేమిటి? అని. నేను చెప్పాను. "రాజ్యలక్ష్మి" అని. ఆమె ఉలిక్కిపడింది. నా అందవికారమైన రూపంవైపు ఎగాదిగా అపరిమితమైన జాలితో చూసింది. విరక్తిగా ఊరుకుంది.

"డాక్టరుగారు ఇప్పుడెక్కడున్నారు? దాదాపు రెండేళ్ళవుతోంది. ఆయన ఉత్తరం రాసినా, జవాబు రాయడంలేదు. కులాసాగా ఉన్నారా?" అన్నాను. ఆమె జవాబు చెప్పలేదు. చలనం లేని బొమ్మలా దిగులుగా చూస్తూ ఊరుకుంది. నేను మళ్ళా అడిగాను.

"ఆయన భార్యను మీ రెరుగుదురా?" అని ఆమె చలించకుండా అల్లాగే ఉండిపోయింది. ఏదో మరో లోకం నుంచి చెబుతున్నట్లు "ఆ" అన్నది.

"ఆమె అందంగా ఉంటుందా?" అన్నాను. ఎంతో అసక్తితో.

ఆమె నవ్వింది.

"ఏదో ఉంటుంది నాకుమల్లేనే?" అన్నది. కాస్సేపుండి మళ్ళా అన్నది ఏదో కసితో. "ఏమైతేనేం? ఆమె ఇప్పుడు ఆయన దగ్గరలేదు. కోపంవచ్చి వెళ్ళిపోయింది?"

నాకు శూలం గుచ్చుకొన్నట్లయింది. డాక్టరుగారి మౌనానికి ఇది కారణం కాబోలు? నాకేకాక నన్ను ఆదరించిన వాళ్ళకు కూడా దుఃఖాలు ఎందుకు కలుగుతాయి? ఇది నా దురదృష్టమా? ఆయన ఎంత బాధపడుతున్నారో? దీనికి నేను ఏవిధంగానైనా బాధ్యురాలిని కాను గదా? ఉపకారం చేసిన వారికి తెలియకుండా అపకారం చేసేభారం నుంచి భగవంతుడు నాకు విముక్తి ప్రసాదించాలి?

ఆమె మళ్ళా ఆయనదగ్గరకు వెళ్ళిందన్న చల్లని కబురు వింటేనే ఈమనస్సుకు మళ్ళీ ప్రశాంతి. ఈ మనస్సు తన కష్టాలను తాను అనుభవించగలదు. తనకు ప్రియమైనవారికి ఆపత్తులకు కలిగే బాధలను భరించలేదు. వారి ఆవేదనాభారాన్ని ఊహించుకొని ఊహించుకుని తీర్చేమార్గం లేక కుమిలిపోతుంది.

అబ్బా? ఎన్నాళ్ళక్రిందటో మరుగువడిన ఈదగ్గు మళ్ళా వస్తోంది.

దగ్గుతో బాధతో మెలికలు తిరిగిపోతున్న నన్ను ఆమె గట్టిగా పట్టుకుంది.

"మీరు ఊరికే బాధపడుతున్నారు. నేను తమాషా కన్నాను. ఆయనా ఆయన భార్యా ఇద్దరూ కులాసాగానే ఉన్నారు. మీ డాక్టరుగారి భార్యను నేనే" అన్నది పేలవంగా నవ్వుతూ.

మంపుతో తల దిమ్మెక్కిపోతున్న నేను చటుక్కున తమాయించుకోటానికి ప్రయత్నం చేశాను. దగ్గు అడ్డువచ్చింది.

ఆమె అపరిమితమైన దయతో కూజాలో నీళ్లు వంచి ఇచ్చింది. నేను కృతజ్ఞతతో రెండు చేతులతో అందుకుని అట్లాగే నమస్కారం చేశాను.

స్టేషన్ వచ్చింది. ఆమె కంగారుపడుతూ గబగబా దిగి వెళ్ళింది. వెళుతూ నన్ను చూసి నవ్వుతూ సెలవు తీసుకుంది. మంచినీళ్ళ గ్లాసుతో నేను అల్లాగే ఆప్యాయంగా ఆమె కనిపించినంతవరకు చూస్తూ ఉండి పోయాను.

*                    *                    *

సరిగ్గా రెండు గంటలయింది. నా కథ కూడా పూర్తయింది. ఇంకా రైలు రాలేదు అన్నది శాంత.

"ఈ వెయిటింగ్ రూమ్‌లో ఇంకా ఎంతసేపో! ఈ ప్రయాణం ఎందుకు తలపెట్టామోకాని, బస్సుకు వెడితే టిక్కెట్లు లేవు. రైలుకు వస్తే బండి మూడు గంటలు లేటు. మన విహారయాత్ర మొదట్లోనే దెబ్బతిన్నది" అన్నది అరుణ విసుగ్గా.

"నీ కథ అయిపోవడ మేమిటి? ఆ తరువాత ఏమైంది? ఆ డాక్టరూ భార్యా కలుసుకున్నారా? అది చెప్పు" అన్నది వాసంతి.

"అదేమో! నువ్వు ఊహించుకో!" అన్నది శాంత.

"ఎందుకు కలుసుకోరూ! తప్పకుండా కలుసుకుంటారు!" అన్నది అరుణ.

"ఏమో! నాకు నమ్మకం లేదు. విరిగిన మనసులు అతకవు" అన్నది వాసంతి.

"ఎందుకు అతకవు! మహాచక్కగా అతుకుతాయి. చదువు పూర్తికాగానే ఆమె భర్త దగ్గరకు వెళ్ళిపోతుంది" అన్నది భానుమతి, అంతవరకు ముఖానికి అడ్డం పెట్టుకున్న పత్రిక విసురుగా దూరంగా విసిరేస్తూ.

"నీ కెలా తెలుసు?" అన్నది ఆశ్చర్యపోతూ అరుణ.

"ఎందుకు తెలియదు? ఆ కథలో సావిత్రిని నేనే. నన్ను గురించే రాసింది శాంత" అన్నది బాధగా భానుమతి, శాంత కేసి చురచుర చూస్తూ.

"ఇది మరీ బాగుంది. నీ కసలు పెళ్ళయిందనే నాకు తెలియదు" అన్నది శాంత తెల్లపోతూ.

"ఫరవా లేదులే రాసినా" అంటూ కొద్దిగా కోపంతో లేచి దూరంగా వెళ్ళిపోయింది భానుమతి.

చెయ్యని దొంగతనం అంటగట్టిన మనిషిలా బాధగా మొహం పెట్టి ఊరుకుంది శాంత.